క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి

- మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ

హన్మకొండ: అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ సూచించారు. కేయూ ఇన్‌చార్జ్ వీసీగా నియమితులైన ఆమె బుధవారం వర్సిటీ సందర్శనకు వచ్చారు. ఈ క్రమంలో హనుమకొండ హౌసింగ్‌బోర్డు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అర్బన్ ఏరియా కారణంగా పోషణ లోపం ఉన్న పిల్లల సంఖ్య తక్కువగా ఉండొచ్చని, పిల్లల బరువు, ఎత్తు కొలతలు నమోదు చేయాలని సూచించారు. మొబైల్‌లో కుటుంబ సభ్యుల పేర్లు ఆన్‌లైన్ చేసేటప్పుడు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ బి.ఝాన్సీలక్ష్మీబాయి, జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ, సూపర్‌వైజర్లు టి.కవిత, డి.రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, సునీత, ఆయా స్వప్న, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి పాల్గొన్నారు.

బార్ ఏర్పాటును నిరసిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు

కాజీపేట: జనావాసాల మధ్య బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు వ్యాపారులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వడ్డెపల్లి ట్యాంక్ బండ్‌పై ఉన్న దేవాలయాలకు అతి సమీపంలో బార్ ఏర్పాటు చేయాలని చూడడం వ్యాపారులకు తగదని సమస్య తీవ్రతను కలెక్టర్‌కు కాలనీవాసులు విన్నవించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి బార్ ఏర్పాటు అంశంపై విచారణ జరిపించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కుల రమణారెడ్డి, నార్లగిరి రామలింగం, కోటిలింగం, కె.సుదర్శన్ రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడబ్ల్యూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అడప మహేష్



వరంగల్: నేషనల్ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ (ఎన్‌సీడబ్ల్యూసీ) వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరంగల్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు అడప మహేష్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ షబ్బీర్‌అలీ మదానీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీవైఎస్‌ఓ అశోక్‌కు సన్మానం

వరంగల్ స్పోర్ట్స్: రాష్ట్రంలోని క్రీడా పాఠశాలలు, క్రీడా వసతి గృహాలు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షక కమిటీ సభ్యుడిగా నియమితులైన హనుమకొండ జిల్లా క్రీడలు, యువజన అధికారి గుగులోతు అశోక్‌ను క్రీడా శాఖ కోచ్‌లు ఘనంగా సన్మానించారు. స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో డీవైఎస్‌ఓను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్‌కు డాక్టరేట్




హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం కోమటిపల్లి ప్రాంతంలోని నిరూప్‌నగర్ తండాకు చెందిన దివ్యాంగుడు కేలోతు గణేష్ డాక్టరేట్ పొందారు. హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ గణేష్‌కు డాక్టరేట్ పట్టాను అందజేసింది. 'ఆన్ ఇంటరాక్టివ్ అప్రోచ్ టూ టీచింగ్ లిజెనింగ్ బంజారా ట్రైబల్' అనే అంశంపై గణేష్ పరిశోధనలు చేశారు. ప్రొఫెసర్ సువర్ణలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధక వ్యాసాన్ని సమర్పించారు. పదవ తరగతి, ఇంటర్‌లో ఫెయిల్‌అయిన గణేష్.. పట్టుదలతో ఓపెన్ ఇంటర్, దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశారు. చిన్నతనంలోనే రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. డాక్టరేట్ పట్టా అందుకోవడంపై గణేష్‌కు కుటుంబ సభ్యులు, బంధువు, మిత్రులు అభినందనలు తెలిపారు.

వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

ఖిలా వరంగల్: రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో యువతీ, యువకులకు తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి, వైఫల్యాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు మండల పరశురాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు 98492 08279 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కొండగట్టుకు పాదయాత్రగా తరలిన మాలధారులు



కాజీపేట: కాజీపేట మండల కేంద్రం నుంచి హనుమాన్ మాలధారులు పాదయాత్రగా కొండగట్టుకు బుధవారం బయలుదేరారు. అభయాంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి ధారణ చేశారు. ఇరుముడులతో కొండగట్టు పంచముఖ ఆంజనేయ స్వామి దర్శనం కోసం సుమారు 200 మందికి పైగా స్వాములు పాదయాత్రగా తరలివెళ్లారు.

ఎదురుచూపులు

- కాజీపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలేనా?
- దూర ప్రాంతాలకు తరలుతున్న విద్యార్థులు
- సీఎం ప్రకటనతో చిగురించిన ఆశలు



కాజీపేట: నగరంలో వ్యాపారపరంగా, పారిశ్రామికంగా దినాదినాభివృద్ధి చెందుతున్న కాజీపేట మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా విద్యార్థుల తలరాతలు మాత్రం మారడంలేదు. మూడున్నర దశాబ్దాలుగా ఎన్నికల సమయంలో ఆయా పార్టీల నాయకులు కాజీపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తూ ఆచరణలో విఫలమవుతున్నారని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం కాజీపేట మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసి ఇంటర్ విద్యకోసం దూరప్రాంతాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన కొందరు తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను బస్సుల్లో దూర ప్రాంతాలకు పంపేందుకు ఇష్టపడకపోవడంతో పదితోనే చదువు మాన్పిస్తూ పెళ్లి చేసి అత్తారిళ్లకు పంపిస్తున్నారు.

మండలంలో పది ఉన్నత పాఠశాలలు

మండలంలో పది ఉన్నత పాఠశాలల్లో దాదాపు 500 మంది ప్రతిఏటా పదో తరగతి పూర్తి చేసి బయటకు వస్తున్నారు. వారితో పాటు ఇంకా ఇతర ప్రాంతాల విద్యార్థులు ఇంటర్ విద్య కోసం ధర్మసాగర్, స్టేషన్ ఘన్‌పూర్, హనుమకొండ, వరంగల్ తదితర ప్రాంతాలకు తరలి వెళ్తుంటారు. బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు గంటల తరబడి వేచిఉంటూ గమ్యస్థానాలకు చేరుతుంటారు. దాంతో సమయం వృథా అవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులతో బస్టాండులు కిక్కిరిసిపోతుంటాయి. బస్సుల్లో వేలాడుతూ పయనిస్తుంటారు. స్థానికంగా కళాశాల ఉంటే అలాంటి బాధలు తప్పుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆందోళనలు చేసినా ఫలితం లేదు

కాజీపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ కొన్నేళ్లుగా విద్యార్థి సంఘాలు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఈ విద్యా సంవత్సరం ఆరంభంలోనే జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి తీరుతామంటూ హామీ ఇచ్చినా ఫలితం శూన్యంగానే మిగిలింది. మంత్రి హామీతో విద్యానగర్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలించిపోవడం చర్చనీయంశంగా మారింది.

చిగురించిన ఆశలు

ఇటీవల విద్యాశాఖ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి జరిపిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు ఎక్కడెక్కడ అవసరమో ఆరా తీయాలని ఆయన ఆదేశించారు. దాంతో ఈవిద్యా సంవత్సరంలోనైనా కాజీపేట విద్యార్థులకు శుభవార్త అందుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

విద్యారంగంలో వెనుకంజ

ట్రైసిటీలో ఒకటిగా పిలువబడే కాజీపేట పట్టణం కాస్త మిగతా ప్రాంతాలతో పోలిస్తే పూర్తిగా వెనుకబడిందనే చెప్పొచ్చు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలే తప్ప ఉన్నత కళాశాలలు లేకపోవడం బాధాకరం. ఇప్పుడిప్పుడే అన్ని రంగాల్లోనూ ముందడుగు వేస్తున్నందున కళాశాల ఏర్పాటు ఆవశ్యకత ఎంతగానో ఉంది.

- మంచె అశోక్, కాజీపేట

అందని ద్రాక్షగా ఉన్నత విద్య

ఉన్నత విద్య స్థానికంగా అందక పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. ప్రతిఏటా వందలాది మంది పిల్లలు 10వ తరగతి ఉత్తీర్ణత సాధిస్తున్నా ఉన్నత విద్యావకాశాలు లేక పైచదువులను మధ్యలోనే ఆపేస్తున్నారు. అలాంటి వారి అవసరాలను ప్రభుత్వం గుర్తించాలి.

- బొడ్డు శ్రావణ్‌కుమార్, కాజీపేట

మొదటి ప్రాధాన్యం కాజీపేటకే..

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదన వస్తే మొదటి ప్రాధాన్యం కాజీపేటకే దక్కుతుంది. ఈ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. విద్యార్థుల శ్రేయస్సును కాంక్షిస్తూ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదు.

- నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే, పశ్చిమ

ఈడబ్ల్యూఎస్‌తో విద్యార్థులకు ప్రయోజనం



మాట్లాడుతున్న గోపు జయపాల్‌రెడ్డి

హసన్‌పర్తి: ఈడబ్ల్యూఎస్‌తో అగ్రవర్ణ నిరుపేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి అన్నారు. కాకతీయ రెడ్డి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా 10వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని గోపాలపురంలోని కేజీఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్‌ను పరిశీలించాలని, సవరించాలని జస్టిస్ ఈశ్వరయ్య బాహాటంగానే పేర్కొన్నారని, దాన్ని తిప్పికొట్టేందుకు రెడ్డిలు ఐక్యంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని రెడ్డి సంఘాలకు కాకతీయ రెడ్డి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం పునాదిగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కంది గోపాల్‌రెడ్డి, రాధారపు సంజీవరెడ్డి, యాదిరెడ్డి, అశోక్‌రెడ్డి, కేశవరెడ్డి, నరహరి, తిరుపతిరెడ్డి, మనోజ్‌రెడ్డి, తెలంగాణరెడ్డి బిడ్డ పత్రిక ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రతినిధి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు జూన్ 10 చివరి గడువు

వరంగల్: వరంగల్‌లోని ప్రభుత్వ (బాలుర), ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ప్రాధాన్యత క్రమంలో ట్రేడ్‌లు, ఐటీఐలను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై కనిష్ఠ వయస్సు 14 ఏళ్లు ఉండాలని, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

1న దత్తక్షేత్రంలో హనుమాన్ జయంతి

హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగురోడ్డులోని గణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో జూన్ 1న హనుమాన్ జయంతి వేడుకను నిర్వహించనున్నట్లు దత్తక్షేత్రం ట్రస్ట్ సభ్యులు వైవీ.వామన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా హనుమాన్ మూర్తికి చందనం, అభిషేకాలు, వడమాల అలంకరణ, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని పేర్కొన్నారు.

కార్మికులకు అండగా బీఆర్ఎస్ పార్టీ



సమావేశంలో మాట్లాడుతూ నాయిని రవి

హన్మకొండ: కార్మికులకు అండగా బీఆర్ఎస్ నిలుస్తోందని ఆ పార్టీ అనుబంధ బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు నాయిని రవి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో కార్మిక మంత్రి లేడని విమర్శించారు. సంఘటిత, అసంఘటిత ఉద్యోగ, కార్మికుల సమస్యలపై గత కొన్నేళ్లుగా కార్మిక నాయకుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో అనేక సదస్సులు, సమావేశాలు, హెల్త్ క్యాంపులు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదని పేర్కొన్నారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు సమావేశాలు, సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో కార్మిక నాయకులు కేశోజు ప్రణయ్, రవీందర్ రెడ్డి, సాయిని రవి, సంజీవ్, చాగంటి రమేష్, కుసుమ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో యువకుడి మృతి



సురేష్ మృతదేహం

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం మోడల్ మార్కెట్‌లోని కవర్ షెడ్‌లో లక్ష్మీపురానికి చెందిన సిలివేరు సురేష్(32) అనే యువకుడు వడదెబ్బతో బుధవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఉదయం మార్కెట్‌లో కూరగాయల అమ్మకాలు ముగిసిన వెంటనే వ్యాపారులు ఇళ్లకు వెళ్లిపోవడం వల్ల కవర్‌షెడ్‌లో మొత్తం ఖాళీగా ఉంటోంది. దాంతో మధ్యాహ్నం చుట్టుపక్కల వారు వచ్చి షెడ్‌లోని ప్లాట్‌ఫాంలపై నిద్రపోతుంటారు. మృతి చెందిన సురేష్‌కు వివాహం కాలేదని, కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. మార్కెట్ అధికారుల ఫిర్యాదు మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులు వచ్చి సురేష్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు.

క్రిస్టియన్‌కాలనీలో ఒకరు..



మృతుడు రాజేష్

ఖిలా వరంగల్ / కాశిబుగ్గ: వరంగల్ క్రిస్టియన్‌కాలనీ జంక్షన్‌లో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన పెసరు రాజేష్ (45) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై క్రిస్టియన్ కాలనీ జంక్షన్‌లో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దాంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

మెరుగైన సేవలతో మరింత విస్తరించాలి



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు, అధికారులు

హన్మకొండ అర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించి ధనలక్ష్మి బ్యాంక్ బ్యాంచ్‌లను మరిన్ని నెలకొల్పాలని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ బొమ్మినేని రవీందర్‌రావు ఆకాంక్షించారు. నగరంలో ఏర్పాటు చేసిన ధనలక్ష్మి బ్యాంక్ నూతన శాఖను క్రెడాయ్ వరంగల్ చాప్టర్ ప్రెసిడెంట్ ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి, వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తోట సంపత్ కుమార్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారుల శ్రేయస్సు కోసం ఆలోచించి అందరికీ ఉపయోగపడే విధంగా స్కీంలను అందించి ప్రజల ఆదరణ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ జీఎం జాన్ వరుగేస్, రీజనల్ హెడ్ కె.సత్యనారాయణ, బ్రాంచ్ మేనేజర్ కె.హిమబిందు, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న భక్తులు

హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 6వ రోజు బుధవారం స్వామివారికి ఉదయం గణపతి పూజ, పుణ్యవచనం, గోత్రనామార్చన నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేసినట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, కృష్ణమాచార్యులు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో సుందరకాండ సహిత సుదర్శన మహాయాగం జరిపించినట్లు వివరించారు. మధ్యాహ్నం భజన కార్యక్రమం నిర్వహించిన అనంతరం అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు. పూజా కార్యక్రమంలో హనుమద్గిరి హనుమాన్ దీక్ష అన్నదాన సేవా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గందె కృష్ణ, కె.రవికుమార్, సభ్యులు అంబటి నరేందర్, ఎం.మొగులయ్య, దశరథ్‌కుమార్, సుధాకర్, హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షికోత్సవం



హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి 53 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేసి అరటిపండ్లు, మామిడిపండ్లను నివేదించారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖ వివాహ వేడుకలు

రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వివాహ వేడుకలను నగరంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. దయానంద కాలనీలో కనక దుర్గామాత దేవాలయంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు లడ్డూలు పంపిణీ చేశారు. అలాగే, కాంగ్రెస్ 19వ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను నగరంలో పలు చోట్ల పేదలకు పంపిణీ చేశారు. వరంగల్ ఆర్టీసీ, రైల్వే స్టేషన్ జంక్షన్‌లో వరంగల్ జిల్లా చిరువ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బుధవారం పండ్లు పంపిణీ చేశారు. దేశాయిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యక్రమంలో 13వ డివిజన్ అధ్యక్షుడు బొట్ల ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అయూబ్, గిన్నారం రాజు, పెండ్యాల కిషన్, కాగితం శ్రీను, దాసరి రాజేష్, భాస్కర్, ఏలియా, సుధాకర్ పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ దామోదర్‌రెడ్డి

కాజీపేట అర్బన్: మెరుగైన పంట దిగుబడి సాధించేందుకు విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ దామోదర్‌రెడ్డి సూచించారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలోని కడిపికొండ, న్యూశాయంపేట గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై రైతులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఏడీఏ దామోదర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వ్యవసాయ శాఖతో గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, తెల్లటి బట్టసంచిలో ఉన్న విత్తనాలు కొనుగోలు చేయవద్దని, సీల్డ్ ప్యాకెట్లలోని విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాలు కొన్న తర్వాత దుకాణ యజమాని నుంచి రసీదు తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యే వరకూ ఆ రసీదును తమవద్ద భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీధర్‌రెడ్డి, ఏఈఓలు భరత్, జయప్రకాష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని కళాశాలను మూసివేయాలి

వరంగల్: నగరం నడిబొడ్డున పోచమ్మ మైదాన్‌లో అనుమతి లేకుండా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్న ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలను మూసివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. పోచమ్మమైదాన్‌లోని కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా బ్యానర్లు, కరపత్రాల ద్వారా చేస్తున్న ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని సూచించారు. అనుమతి లేకున్నా అడ్మిషన్లు తీసుకుంటున్నారని, విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఆల్ఫోర్స్ కళాశాలపై ఇంటర్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, పోస్టర్లను తొలగించాలని లేకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వరంగల్ నగరంలో పలు ప్రైవేట్ కళాశాలలకు అనుమతి, షిఫ్టింగ్ పర్మిషన్ లేకుండా ఆ కళాశాలలో పేర్లతో ఫ్లెక్సీలు కట్టి విద్యార్థులను మోసం చేస్తున్నారని, ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు చెప్పినా కూడా స్పందన లేదని ఆరోపించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ వరంగల్ మండల నాయకులు సూర్యవంశీ, శ్రావణ్ శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కురుమలకు నగదు బదిలీపై హామీ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గొల్ల కురుమలకు నగదు బదిలీపై ప్రభుత్వం కచ్చితమైన హామీ ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు. ఎంజీఎం సమీపంలోని జేడీ కార్యాలయంలోని డాక్టర్ అసోసియేషన్ బిల్డింగ్ హాల్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ అధ్యక్షతన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి 80 లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం సగం మందికి మాత్రమే గొర్రెలు పంపిణీ చేసి గొల్ల కురుమలను మోసం చేసిందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాడబోయిన లింగయ్య, అవిశెట్టి శంకరయ్య, తుషాకుల లింగయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొల్లం అశోక్, సాదం రమేష్, మద్దెపురం రాజు, పరికి మధుకర్, కాల్వ సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై మాట తప్పిన ప్రభుత్వం

కాజీపేట: పార్టీ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే గొర్రెల స్కీమ్‌ను అమలు చేస్తామని ప్రకటించిన నేటి ప్రభుత్వం.. ఇచ్చిన మాటను తప్పి లబ్ధిదారులకు డీడీలను వాపస్ చేయడం బాధాకరమని ఉమ్మడి వరంగల్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల సమాఖ్య మాజీ చైర్మన్ మేకల కేదారి యాదవ్ విమర్శించారు. సోమిడిలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల, కురుమలను మోసం చేయగా, ఇప్పటి కాంగ్రెస్ సర్కారు కూడా అదే దారిలో పయనిస్తోందన్నారు.

చదువుతోనే సమాజంలో మార్పు



కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవేందర్

హన్మకొండ: సమాజ మార్పు, కుటుంబ ఆర్థిక అభివృద్ధి జరగడానికి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ సూచించారు. మెపా ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కుటుంబాల్లో ఎక్కువశాతం మంది ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే చదువు ఆపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారికి మెపా అండగా ఉంటూ భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు ముదిరాజ్, సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నూనె శివకుమార్, ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యాంసుందర్, నాయకులు వినోద్, పులి లావణ్య, రావుల రాణాప్రతాప్, అచ్చునూరి కిషన్, పులి సదానందం, ఉపాధ్యాయులు ధర్మదేవ్, కుక్కల శ్రీనివాస్, శీలం నీరజ, రాము, రవళి, రణధీర్, నాగేశ్వరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆవిర్భావ ఉత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బండి రజనీకుమార్

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. జూన్ 1న అమరులకు పుష్పాంజలి, కొవ్వొత్తులతో ప్రదర్శన, 2న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు, అదేరోజు ఆస్పత్రులు, అనాథాశ్రమాల్లో పండ్ల పంపిణీ, 3న రాష్ట్రవ్యాప్తంగా జాతీయ జెండాలు, పార్టీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మాజీ సర్పంచ్ చుంచు రవి, బీఆర్ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఇమ్మడి రాజేందర్, నాయకులు మేకల యుగంధర్, ప్రమోద్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

విద్యారణ్యపురి: కామన్‌స్కూల్ విద్యావిధానం సాధనే టీపీటీఎఫ్ ఎజెండా అని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి సూచించారు. టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ పతాకాన్ని ఎగురవేసి తిరుపతి మాట్లాడారు. పదేళ్లుగా రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో నాయకులు పురుషోత్తం, బాధ్యులు బత్తిని శ్రీరామాంజనేయులు, గువ్వాడ జలపతిరావు, గొడిశాల రమేష్, భీమళ్ల సారయ్య, అంకం శ్రీనివాస్, రామంచ భిక్షపతి, భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ఎండీ.సత్తార్, పాక కుమారస్వామి, భూక్య సారయ్య, కొండ శ్రీనివాస్, కొమురయ్య, చంద్రమౌళి, సమ్మయ్య పాల్గొన్నారు.